క్లుప్తంగా

కూలిన ఇళ్లు, పంట నష్టంపై సర్వే



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

నెన్నెల: మండలంలోని నెన్నెల, బొప్పారం, కొత్తగూడం, గంగారాం గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయిన ఇళ్లను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేందర్‌నాథ్‌తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్లు కూలిన బాధితుల వివరాలు సేకరించారు. ఉద్యానవన అధికారి అరుణ్, వ్యవసాయాధికారులు రాంచందర్ క్షేత్ర స్థాయిలో వెళ్లి పంటల సర్వే నిర్వహించారు. నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. సుమారు 800ఎకరాల్లో మామిడికి, 300ఎకరాల్లో వరికి నష్టం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారుల వెంట పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, హరీష్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి: మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలోని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5నుంచి 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని 26న సెలక్షన్ లిస్టు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బిల్లకూరి సాయికుమార్ మార్చి 2న తన స్మార్ట్‌ఫోన్ పోవడంతో, దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికి పట్టుకున్నారు. పోగొట్టుకున్న ఫోన్‌ను శుక్రవారం సాయికి అందించినట్లు ఎస్సై తహాసినొద్దీన్ తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

దండేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువతీ, యువకులు రాజీవ్ యువ వికాస్ పథకం కోసం చేసుకున్న దరఖాస్తులను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, దండేపల్లి మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి పురుషోత్తం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలించారు. ఎంపీడీవో ప్రసాద్ వివిధ గ్రామాల జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో కుల గణన చేపట్టాలి

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వక భవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. ఒక సంవత్సరంలో కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు రాజేశంగౌడ్, వనజారాణి, జి.రమేష్, శంకర్ గౌడ్, రాజయ్య, శ్రీశైలం, శైలాభాను, రాజేష్‌చారీ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను గ్రామసభలతో ఎంపిక చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దుర్గం అశోక్, నాయకులు

కోటపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభలతో పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎన్నుకోవాలని బీజేపీ జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్ అన్నారు. కోటపల్లి మండలకేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇండ్లు, భూమి కోల్పోయిన నిరుపేదలతో శుక్రవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్ మాట్లాడుతూ.. రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోయిన మండలకేంద్ర వాసులకు మొదటివిడతలో అందరికి ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభలు నిర్వహించి ఎంపిక చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, ఉపాధ్యక్షుడు పున్నం, నాయకులు వెంకన్న, శ్యాంసుందర్, సాయికుమార్, శ్రీనివాస్, మహేశ్, నవీన్ పాల్గొన్నారు.

కొనుగోళ్ల బాధ్యత ఆమెకే

- 50శాతానికి పైగా కేంద్రాలు ఎస్‌హెచ్‌జీలకు కేటాయింపు
- మహిళల భాగస్వామ్యం పెంచేందుకు ప్రభుత్వం కృషి
- నిర్వాహకులకు ఇప్పటికే శిక్షణ పూర్తి



దండేపల్లి: ధాన్యంలో తేమశాతం పరిశీలిస్తున్న నిర్వాహకులు

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వాములను చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు తీసుకుంటోంది. వనితలు వ్యాపార రంగంలో తామేమీ తక్కువ కాదంటూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గత కొన్నేళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. దీంతో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజాగా యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను మంచిర్యాల జిల్లాలో 50శాతానికి పైగానే మహిళా సంఘాలకు కేటాయించారు. కొనుగోళ్లలో మహిళలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఇటీవల శిక్షణ కూడా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహించే స్వయం సహాయ సంఘాల మహిళలు, రైతులను సమన్వయం చేసుకుంటూ నిబంధనల మేరకు వచ్చి న ధాన్యాన్ని త్వరగా కాంటా వేయించి సకాలంలో మిల్లులకు ధాన్యం చేరేలా చేయడంతో పాటు రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను సకాలంలో వారి ఖాతాల్లో జమచేయించడం వంటి వాటిని గురించి శిక్షణలో వివరించారు.

వారధిలా మహిళా సంఘాలు..

అటు ప్రభుత్వం, ఇటు రైతులకు మధ్య వారధిలా మహిళా సంఘాలు అన్నదాతల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి అందిస్తున్నారు. ఇందుకు గాను క్వింటాల్‌కు రూ.32చొప్పున ప్రభుత్వం నిర్వాహకులకు కమీషన్ చెల్లిస్తోంది. ఈ లెక్కన స్వయం సహాయక సంఘాలు కొనుగోలు చేసిన ధాన్యం విలువ ప్రకారం ఒక్కో సంఘానికి సుమారు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పైగా కమీషన్ ద్వారా ఆదాయం పొందుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మహిళ సంఘాలకు 194కేటాయింపు..

మంచిర్యాల జిల్లాలో మొత్తంగా ప్రస్తుత యాసంగిలో 321కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో మహిళా సంఘాలకు 194, సహకార సంఘాలకు 121, మెప్మాకు 6 కేటాయించారు. ఇందులో ఎక్కువ మొత్తంలో మహిళ సంఘాలకు కేటాయించారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మహిళ సంఘాలతో పాటు, సహకార సంఘాలు, మెప్మాకు కేటాయించగా, మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రం మొత్తం మహిళ సంఘాలకు కేటాయించడం విశేషం.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలని..

ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లలో మహిళా సంఘాలకు మొదటి ప్రాధాన్యం కల్పించారు. జిల్లా మొత్తంగా 321కొనుగోలు కేంద్రాల్లో 194కేంద్రాలు మహిళా సంఘాలకు కేటాయించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణతో వచ్చే కమీషన్ డబ్బులతో మహిళ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి.

\- కిషన్, డీఆర్‌డీవో

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



జిల్లా బీజేపీ కార్యాలయంలో...

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/వేమనపల్లి: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు, కులగణన కూడా చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో, మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద, వేమనపల్లిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. దేశవ్యాప్త కులగణనపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల, రిజర్వేషన్ ఫలాలు అన్ని కులాల వారికి సామాజిక న్యాయ కోణంలో అందుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజుకుమార్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొడ్డున మల్లేశ్, మంచిర్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లి రాకేశ్, మంచిర్యాల అసెంబ్లీ కన్వీనర్ తోట మల్లిఖార్జున్, పట్టణ కార్యదర్శి బోయిని హరికృష్ణ, రెడ్డిమల్ల అశోక్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు దేవరకొండ వెంకన్న, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగుల రాజన్న, బెల్లంకొండ మురళి, పూదరి రాంచందర్, బిజెవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రొడ్డ మోహన్, రామటంకి దుర్గరాజ్, కోలేటి శివ, కొంతం రాజు, ఎర్రోజు శ్రీనివాస్, మార్త కుమార స్వామి పాల్గొన్నారు. మందమర్రిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త కుమారస్వామి, నాయకులు దుర్గరాజ్, రొడ్డ మోహన్, కొంతం రాజు, శివ, శ్రీనివాస్, ఓంప్రకాష్, రాంమూర్తి, అంజయ్య, రాజేంద్రప్రసాద్, వేమనపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి ఎనుముల వెంకటేశ్, మాజీ వార్డు సభ్యులు మధునయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు చరణ్‌రాజ్, స్వామి, సత్యనారాయణ, చారి తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్

మంచిర్యాలక్రైం: తిర్యాణికి చెందిన రాజేశ్వరీ శుక్రవారం తాండూర్ ఐబీ నుంచి ఆటోలో మంచిర్యాలకు వచ్చింది. హైటెక్ సిటీ దగ్గర దిగి, తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌ను ఆటోలో మరిచి వెళ్లిపోయింది. కొద్ది సేపటికి బ్యాగ్ గుర్తుకురావడంతో, తాండూర్ ఐబీ ఆటో యూనియన్ అధ్యక్షుడికి ఫోన్ చేసి తెలియజేయగా ఆటో యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ హబీబ్‌భాషా, ఆటోకు సంబంధించిన వివరాలు కనుక్కొని డ్రైవర్ జాడి రామకృష్ణకు ఫోన్ చేశారు. తన ఆటోలో మహిళ బ్యాగ్ మర్చిపోయిన విషయం తెలియజేయడంతో, వెంటనే ఆ బ్యాగును తీసుకొచ్చి రాజేశ్వరికి అప్పగించి, తన నిజాయతీ చాటుకున్నాడు. బ్యాగులో రూ.మూడు లక్షల విలువ గల బంగారం ఉన్నట్లు రాజేశ్వరి తెలిపారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3,818మంది రైతుల నుంచి 33,740మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, ఇప్పటి వరకు రూ.13,43కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500బోనస్ లభిస్తుందన్నారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధన ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాల్లో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. రోజు 4వేల నుంచి 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తూకం వేసి 155లారీల ద్వారా 1,600నుంచి 3వేల టన్నుల ధాన్యం మిల్లులకు పంపిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 16మిల్లులతో పాటు కరీంనగర్‌లోని 26మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ప్రతి రోజు 3కోట్ల నుంచి 5 కోట్లు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రడగంబాల బస్తీలో పరస్పర దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వే రడగంబాల బస్తీలో శుక్రవారం పరస్పరం దాడి చేసుకున్నారు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. రైల్వే రడగంబాల బస్తీలో గుడుంబా అమ్ముతున్నట్లు పక్కా సమాచారం అందడంతో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది రెయిడ్స్‌కు వెళ్లారు. బస్తీలోని లవుడియా దీపక్, లవుడియా మోహన్ ఎక్సైజ్ పోలీసు కానిస్టేబుల్ సురేష్‌తో గొడవపడి ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లావాసికి శ్రమశక్తి అవార్డు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన ప్లంబర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పొట్టాల మల్లేశ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే డే సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ చేతుల మీదుగా శ్రమ శక్తి అవార్డు అందుకున్నారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసినందుకు ఈ అవార్డును ప్రభుత్వం నుంచి పొందడం సంతోషంగా ఉందని అవార్డు గ్రహీత మల్లేశ్ పేర్కొన్నారు.

ఘనంగా శంకర జయంతి

చెన్నూర్: చెన్నూర్ శివాలయంలో శంకర్ జయంతి సందర్భంగా 73వ గణపతి అధర్వ శీర్ష సహస్రాభిషేకాన్ని బ్రాహ్మణ కులస్తులు ఘనంగా నిర్వహించారు. మహవాది వినోద్‌కుమార్, కులస్తులు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో శుక్రవారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాజీవ్‌నగర్‌కు చెందిన జోడు సాయికుమార్, తిలక్ నగర్‌కు చెందిన సయ్యద్ జుబేర్, చున్నంబట్టి వాడకు చెందిన విలాసాగరం తిరుపతి, దొరగారిపల్లెకు చెందిన కొడిపే లక్ష్మణ్ మూడు ముక్కలాట ఆడుతున్నారని తెలిపారు. దాడి చేసి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.3450 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని తెలిపారు.

కొనసాగుతున్న దివాకరన్న పెరుగన్నం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రారంభించిన దివాకరన్న పెరుగన్నంను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సత్యం, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మలేషియాలో నృత్య ప్రదర్శన

జన్నారం: ప్రపంచ డ్యాన్స్ డే సందర్భంగా మలేషియాలో ఉద్యోగ రిత్యా స్థిరపడిన తమిళనాడుకు చెందిన అరుద్ర నాట్య సమర్పణం ఆధ్వర్యంలో మలేషియా ఫెస్టివల్ లో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో జన్నారం మండలం నటరాజ కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులు, మాస్టర్ నర్మదగౌడ్‌లు ఆరుద్ర నాట్య సమర్పణం చైర్మన్ సోమేశ్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందుకున్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే శిక్షణ శిబిరాలు

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయుల సూచన



జన్నారం: వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఎం రాజమౌళి

జన్నారం: విద్యార్థుల నైపుణ్యాలను వెలుగు తీసేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడుతాయని, ప్రభుత్వ ఆదేశానుసారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని మే 2 నుంచి మే 16 వరకు నిర్వహించనున్నట్లు కలమడుగు ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి తెలిపారు. ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పీడ్ మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు భాష నైపుణ్యాలు, పాటల ద్వారా విద్యా బోధనలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నుంచి వేసవి శిబిరాలు (సమ్మర్ క్యాంపులు) ప్రారంభమయ్యాయి. దొనబండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.హన్మాండ్లు, ముల్కల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో శిబిరం ఆరంభం కాగా ముల్కల్ల, నంనూర్, గుడిపేట, నర్సింగాపూర్, హాజీపూర్, దొనబండ, పెద్దంపేట, రాపల్లి, టీకానపల్లి, వేంపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం, వ్యాయామ విద్య, యోగా, చెస్, క్యారమ్, బాడ్మింటన్, ఇంగ్లిష్ గ్రామర్, గణితంలో శిక్షణ ఇస్తున్నారు. దొనబండ పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని వేమనపల్లి పాఠశాలలో ఎంఈవో శ్రీధర్‌రెడ్డి శుక్రవారం సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. 16వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంపు కొనసాగనుంది. యోగా, పేయింటింగ్, ఇంగ్లిష్ గ్రామర్ మొదలైనవి నేర్పిస్తామన్నారు. 5 నుంచి 9వ తరగతి విద్యార్థులు హాజరై అన్ని మెలకువలు నేర్చుకోవాలని కోరారు.

భీమిని: సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కన్నెపల్లి ఎంఈవో రాము అన్నారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. డ్యాన్స్, యోగా, ఆటలు, ఇండోర్ గేమ్స్ 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎల్పుల రోహిత్, కొత్తకొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని రేచినీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం పదిహేను రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డ్రాయింగ్, క్రాఫ్ట్, ఫైన్ ఆర్ట్స్, యోగా, కరాటే తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.ప్రదీప్, యువజన కాంగ్రెస్ మండల నాయకుడు భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్, స్థానికులు పాల్గొన్నారు.

దండేపల్లి: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15రోజుల పాటు నిర్వహించే సమ్మర్ క్యాంపు శుక్రవారం ఆయన ప్రారంభించారు. దండేపల్లి మండలంలో దండేపల్లి, ద్వారక, వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. డ్రాయింగ్, పేయింటింగ్, యోగా, ఆటలు, స్పోకెన్ ఇంగ్లిష్, సింపుల్ మ్యాస్ అంశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు ప్రమోద్, సీఆర్పీ నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ నస్పూర్ జెడ్పీ హెచ్ఎస్, తీగల్ పహాడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలలో విద్యార్థులకు శుక్రవారం నుంచి సమ్మర్ క్యాంపులను ప్రారంభించినట్లు ఎంఈవో దామోదర్‌రావు తెలిపారు. క్యాంపులకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ముల్కల్లలో చిత్రలేఖనం చేస్తున్న విద్యార్థులు



నస్పూర్: నృత్యం చేస్తున్న విద్యార్థులు



జన్కాపూర్‌లో క్యాంప్ ప్రారంభిస్తున్న ఎంఈవో

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కోటపల్లి/శ్రీరాంపూర్: కేంద్ర అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం రాష్ట్ర కమిటీ సమావేశం, కోటపల్లిలో సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా కార్మిక విధానలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, నాయకులు కోతుల కృష్ణయ్య, నరేష్, రామకృష్ణ, అశోక్, రాయమల్లు, కోటపల్లి మండల కన్వీనర్ రవి, నాయకులు కుమార్, మహేశ్, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జీఎం అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులను శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అభినందించారు. శుక్రవారం జీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉన్నత చదువుల్లో కూడా రాణించాలన్నారు. 62మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో ఒకరి మినహా, మిగితా వారందరూ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 500పైన మార్కులు ఆరుగురు విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సంతోశ్, ఉపాధ్యాయులు అనురాధ, శ్రీపతిరావు, శ్రావణ్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఎంవీటీసీలో సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎంవీటీసీలో సౌకర్యాలు కల్పించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పాగాకు రమేశ్ తదితరులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం వచ్చే వారికి రక్షిత తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. బోధన సిబ్బందికి ప్రత్యేక వాష్ రూమ్‌లు, మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక రెస్ట్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. క్యాంటీన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రస్తుతం ఉన్న టీచింగ్స్ రూమ్స్‌లను ఆధునీకీకరించి తగిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుకూలంగా తరగతులను బోధించాలన్నారు. కంపెనీలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో ఎక్కువ మంది ఉద్యోగులకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు, ఈ సౌకర్యాలను తక్షణమే కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

నియామకం

శ్రీరాంపూర్: కోలిండియా జేబీసీసీఐ 11 స్టాండర్డైజేషన్ కమిటీ ఆల్టర్నేటీవ్ సభ్యునిగా సింగరేణి నుంచి బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్యను నియమించారు. ఈ మేరకు కోలిండియా యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సత్తయ్య నియామకంపై ఆ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే కులగణన'



మాట్లాడుతున్న వేణు

నస్పూర్: రాహుల్‌గాంధీ పోరాట ఫలితంగానే జనగణనలో కులగణన చేపడుతామని కేంద్రం ప్రకటించిందని మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భారత్ జోడోయాత్ర సందర్భంగా రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలో కుల గణన చేపడుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన సూచన మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టి దానిని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కులగణనలో రాష్ట్రం దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. అంతేకాకుండా ఇటీవల పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రేపు చేపట్టిన మంచిర్యాల పట్టణ బంద్‌లో వ్యాపార వాణిజ్య రంగాలతో పాటు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కలీద్, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తాళ్ల సంపత్ రెడ్డి, నాయకులు కోండ్ర లింగయ్య, నరిగె నరేశ్, చిందం మల్లేశ్, భూపతి శ్రీనివాస్, యశోద తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ బీజేపీ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

జైపూర్: జైపూర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా రెండో సారి దూట రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు.